విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి నెం. 5
సోమవారం 9, సెప్టెంబర్, 2024

ఇస్కఫ్ జిల్లా కార్యదర్శిగా మార్కండేయులు

విశాలాంధ్ర - విశాఖ: ఇస్కఫ్ విశాఖ జిల్లా కార్యదర్శిగా దేవరకొండ మార్కండేయులు ఎన్నికయ్యారు. ఆదివారం ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. కార్యదర్శులుగా ఉన్న జె.రాంప్రభు, పి.శ్యామ్ సుందర్‌లు సంయుక్త కార్యదర్శులుగా, వై సత్యవతి, సిహెచ్ మధుబాబు కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారు. ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు టీఎస్ సుకుమార్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది.

10న రాస్తారోకోకు పూర్తి మద్దతు: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - పెదగంట్యాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 10న తలపెట్టిన రాస్తారోకోకు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) పూర్తి మద్దతు తెలుపుతుందని విశాఖ జిల్లా అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కెంగువ అచ్యుత్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి కుమార స్వామి, సహాయమంత్రి శ్రీనువాస్ వర్మ విశాఖ ఉక్కు పరిశ్రమను సందర్శించి 60 రోజులు గడుస్తున్నా ఉక్కును సమర్ధవంతంగా నడపడానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోగా విశాఖలో ఉక్కు పర్యటన నేపథ్యంలో ఉక్కు కార్మికులు తరమి కొడతారని కంటితుడుపు మాటలు చెప్పి వెళ్లిపోయారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ఆ దిశగా పనిచేయడం లేదని ఉక్కును మరింత నష్టాలు ఊబిలోకి నెట్టి అదానికి కట్టబెట్టడానికి విశ్వప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు.

విద్యుత్ స్తంభాలపై మొక్కల తొలగింపు

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డ్ ఇటీవల విశాలాంధ్రలో "విద్యుత్ తీగలపై మొక్కలు తొలగించండి ప్రభో" అనే వార్తకు స్పందన లభించింది. పద్మనాభనగర్‌లో విద్యుత్ స్థంభాలు, తీగలపై పొదులు, మొక్కల్ని తొలగించటం జరిగింది అని ఏఈఈ డి.వి.రమణమూర్తి తెలిపారు. పత్రికలో ప్రజలకు మేలు చేసే ఇటువంటి వార్తలు, కథనాలకు వెంటనే స్పందించిన అధికారులకు, పత్రికా యాజ మాన్యానికి గ్రామాభ్యుదయ సంఘ అధ్యక్షులు, టీడీపీ నాయకులు నందవరపు సోములు కృతజ్ఞతలు తెలియజేసారు.

ఆందోళనలో కొండవాలు ప్రాంతవాసులు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని 61, 62, 63, 59 వార్డు పరిధిలోని కొండవాలు ప్రాంతాల ప్రజలు గత రాత్రి నుండి కుండపోతగా కురుస్తున్న వర్షాలకు బిక్కుబిక్కుమంటూ కాలం వెలబుచ్చుతున్నారు. ఆదివారం కొన్నిచోట్ల మట్టిపెల్లలు ఊడి పడుతున్నాయని రిటర్నింగ్ వాల్స్ కూడా దెబ్బతిని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సురక్షిత ప్రాంతాలకు రావాలని అధికారులు తెలిపినప్పటికీ కొంతమంది ఇళ్లలోనే ఉండిపోవడంతో ప్రమాదం చోటు చేసుకుంటుందేమో అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి వారిని యుద్ధ ప్రాతిపదికన సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారని కోరుతున్నారు.

విశాఖ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా భగత్ పిరిడి

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా భగత్ పిరిడి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. భగత్ గతంలో పార్టీకి చేసిన సేవలే ఆయన్ను ఈ స్థాయి వరకు తీసుకు వచ్చింది. 2007 నుంచి 2014 వరకు విశాఖ జిల్లా ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడిగా, 2014 నుంచి 2017 వరకు ఆ విభాగ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా, 2019 వరకు ఏకంగా ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. 2023 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2019లో విశాఖ వెస్ట్ అసెంబ్లీకి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేశారు. 2024లో పెందుర్తి అసెంబ్లీకి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన భగత్ పిరిడికు కాంగ్రెస్ నాయకులు అభిమానులు అభినందనలు తెలియజేశారు.

జూడో పోటీలకు

శ్రీ వెంకట విద్యాపీఠ్ విద్యార్థులు

విశాలాంధ్ర - ఆనందపురం: చెన్నైలో ఈనెల 10 నుండి 13 వరకు జరగబోయే జూడో పోటీలకు ఆనందపురం సొంత్యాం

గ్రామంలో గల శ్రీ వెంకట విద్యపీట్ విద్యార్థులు ఆదివారం బయలుదేరారు. ఇటీవల రాష్ట్ర జూడో క్రీడా సంఘం సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పాండ్రంకి రుఖ్మాకరరావు ఆధ్వర్యంలో ఖేలో ఇండియా సౌత్ జోన్ జూడో చాంపియన్ షిప్ బాలికల ఎంపికలు నిర్వహించారు. చెన్నైలో జరిగే పోటీలకు బయలుదేరిన విద్యార్థులను శ్రీ వెంకట్ విద్యా పీఠ్ చైర్మన్ అండ్ డైరెక్టర్ రొంగలి వెంకటేశ్వరరావు, చీఫ్ కోచ్ లెంక అప్పల రాము, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నేడు పాఠశాలలకు సెలవు

కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రతికూల వాతావరణం, ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా సోమవారం విశాఖపట్నం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంబంధిత జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

కుండపోత వర్షం

ప్రజలకు తప్పని కష్టాలు
వరద నీటిలో అనేక లోతట్టు ప్రాంతాలు
విద్యుత్ సదుపాయం లేక తీవ్ర అవస్థలు
నేడు పాఠశాలలకు సెలవులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గత కొన్ని రోజులుగా వర్షాలు ప్రజల్ని కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాష్ట్రమంతా వరద మయం నెలకొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయు గుండంగా మారింది. క్రమంగా వాయవ్యదిశగా కదులుతోంది. రాబోయే 24 గంటల్లో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుందని దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పలు చోట్ల చెరువుల్లోకి భారీగా వరదనీరు చేరుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో ఒకట రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీరం వెంట బలమైన ఈదురు గాలులు వీస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి కేవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా విద్యుత్ సదుపాయం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అనేక చోట్ల రహదారులు కొట్టుకుపోవడంతో రవాణా స్తంభించిపోయింది. ప్రధాన రహదారులన్నీ చెరువులు తలపించేలా వరద నీటితో ప్రవహిస్తున్నాయి. అధిక వర్షాల కారణంగా అనేక రైళ్లు రద్దు అయ్యాయి. విశాఖ జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయ మయ్యాయి. వన్‌టౌన్, జ్ఞానాపురం, కంచరపాలెంలో కొన్ని ప్రాంతాలు, మద్దిలపాలెంలో కేఆర్ఎం కాలనీ, ఆరిలోవలో కొన్ని ప్రాంతాలు వరద అనేక ఇళ్లలోకి ప్రవేశించింది. మరోపక్క కొండవాలు ప్రాంతాల్లో తీవ్ర అలజడి నెలకొంది. మధురవాడ, ఆరిలోవ, పెందుర్తి, గాజువాక, మల్కాపురం, తాటిచెట్లపాలెం, కంచరపాలెంతోపాటు అనేక ప్రాంతాల్లో ఉన్న కొండలపై ఉన్న నివాసాలు విస్తారంగా కురుస్తున్న వర్షాలకు నానిపోయి మట్టి జారిపోయే ప్రమాదం ఏర్పడడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనకు గురయ్యారు. విశాఖ జిల్లాలో ఉన్న 11 మండలాల్లో 68 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 11 మండలాల తాసిల్దార్లు వరద సహాయక చర్యల్లో నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తెరుపు లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. విశాఖ నగర మేయర్ ఎర్రగడ్డ వరద ప్రవాహంపై ఆ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని జీవీఎంసీ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరొక ఎమ్మెల్యేలు నియోజకవర్గం వరద తీవ్రతతో పాటు పలుచోట్ల కూలిపోయిన ప్రదేశాలను పరిశీలించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆయా ప్రాంతాల్లో పర్యటించారు.

ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - భీమిలి: వాయుగుండం కారణంగా ఈ మూడు రోజులు భారీ నుండి అతిబారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని భీమిలి జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, 3వ డివిజన్ కార్పొరేటర్ గంటా అప్పలకొండ ప్రతినిధి గంటా నూకరాజు సూచించారు. భీమిలి జోన్ 3 వ వార్డులో ఉన్న పలు ప్రాంతాలను గంటా నూకరాజుతో కలసి కమీషనర్ కనక మహాలక్ష్మి సందర్శించారు. తోటవీధి, బొడ్డోడు గెడ్డ, నేరెళ్లవలస కాలనీ, ఎస్ఓఎస్ ప్రాంతంలో ఉన్న దివ్యాంగుల కాలనీని సందర్శించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఉప్పుటేరుకు దగ్గరలో ఉన్న తోటవీధి గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. భారీ వర్షాలు పడటం వలన పై నుండి వరదలు, గెడ్డలు ఉప్పుటేరు మీదుగా వచ్చే అవకాశం ఉందని జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఎస్ఓఎస్ ప్రాంతంలో ఉండే దివ్యాంగుల కాలనీకి అందుబాటులో ఉండే రోడ్డును కొంతమంది ప్రైవేటు వ్యక్తులు తొలగించారని, దీనివలన వీరికి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గంటా నూకరాజు జోనల్ కమీషనర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. వెంటనే స్పందించిన కమిషనర్ దీనిపై తగిన నిర్ణయం తీసుకొని వారికి ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అదేవిదంగా నేరెళ్లవలస కాలనీ, బొడ్డోడు గెడ్డ ప్రజలతో కూడా చర్చించారు. పిల్లలను బయటకు పంపించవద్దని అన్నారు. కరెంటు స్తంబాల వద్దకు పిల్లలను వెళ్ళనీ యకుండా చూడాలని అన్నారు. భారీ వర్షాలు పడటం వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మీకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గోపాలపట్నంలో కొండచరియలు విరిగి పడుతున్నాయి. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామకృష్ణనగర్ కాళీమాత గుడి దారిలో, కంచరపాలెం లో కొండచరియలు విరిగిపడ్డాయి. పలు ఇళ్లకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు అధికారులు స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మిగతా ఇళ్లకూ ప్రమాదం పొంచి ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ అధికారులు హెచ్చరించారు. గోపాలపట్నంలో చాలా ఇళ్లు కొండ వాలు ప్రాంతంలో ఉంటాయి. కొండ దిగువన కూడా పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయి. దీంతో ఆ ప్రాంత వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొండ ప్రాంతాల్లో నిర్మాణాలు వద్దు అంటూ పదే పదే వార్తలు రాస్తూ, అధికారులు, కబ్జాదారులు, కబ్జాలు చేసే బ్రోకర్లకు, మీడియా ప్రతినిధులు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. కొండల మీద ఇళ్లు, పాకలు, షెడ్లు నిర్మించేటప్పుడు పదేపదే వద్దు అని వార్తలు ఎన్నిసార్లు రాసినా పట్టించుకోకుండా అధికారులు, రాజకీయ నాయకులు, ఇలాంటి నిర్మాణాలు ప్రోత్సహించడం వలన, రానున్న రోజుల్లో కొండల మీద, చెరువులో, గెడ్డ వాగుల్లో నిర్మాణాలు అధికారులు ప్రోత్సహించడం వలన ప్రజల ప్రాణాలకు హానికరం ఉందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి చెరువులోను, గెడ్డ వాగుల్లోను, కొండలపై నిర్మించే వాటిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాలపట్నం, నాయుడు తోట, బర్మా క్యాంప్, అక్కయ్యపాలెం, తాటి చెట్ల పాలెం, పరిసర ప్రాంతంలో ఎక్కువగా కొండ ప్రాంతంలో, గడ్డ వాగుల్లో, చెరువుల్లో నిర్మాణాలు సాగిస్తుంటే అధికారులు పట్టించుకో కుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో అందుబాటులోకి డీజీ సేవలు

విశాలాంధ్ర - విశాఖసిటీ: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు డీజీ సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్‌తోపాటు ఎమ్మెల్యేలు అధికారులు పాల్గొన్నారు. పాట్నా, రాయ్‌పూర్, భువనేశ్వర్, గోవా, ఇండోర్, రాంచి, కోయంబత్తూర్, బాగ్ డోగ్రా ఎయిర్ పోర్ట్‌లలో కూడా డీజీ సేవలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. ఇప్పటికే హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 15 ఎయిర్‌పోర్టుల్లో ఈ సదుపాయం ఉంది. ఇప్పుడు మరో తొమ్మిది విమానాశ్రయాల్లో ఈ సేవలు అందుబాటులో తీసుకొచ్చారు. డిజి యాత్ర యాప్ డౌన్లోడ్ చేసుకుంటే.. ఫేస్ రికగ్నిజేషన్ టెక్నాలజీ ద్వారా ప్రయాణికులకు అందుబాటులోకి సులభతర సేవలు అందుతాయి. చెక్ పాయింట్లు, బోర్డింగ్ పాయింట్ల వద్ద ఈజీ యాక్సెస్ ఉంటుంది. డిజి యాప్ ద్వారా స్మార్ట్ ఫోన్లోనే సేవలు అందుబాటులో ఉంటాయని రామ్మోహన్ నాయుడు అన్నారు. 5 సెకండ్లలో ఎంట్రీ అయ్యేలా సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రెండేళ్లలో భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పూర్తిచేస్తామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం సింగిల్ డిస్ట్రిక్ట్‌గా సహకరిస్తుందన్నారు. విశాఖ నుంచి మళ్లీ ఇంటర్నేషనల్ కనెక్టివిటీ పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సంగివలస బ్రిడ్జి కింద వర్షపు నీటి సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర - భీమిలి: వర్షా కాలంలో జాతీయ రహదారిపై ఉన్న సంగివలస బ్రిడ్జి కింద నిలిచిపోతున్న వర్షపు నీటి వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. వర్షం వచ్చిన ప్రతిసారి బ్రిడ్జి కింద రెండు వైపులా అడుగున్నర, రెండు అడుగుల ఎత్తున నీరు నిలిచిపోతుందని ఆయన తెలిపారు. దీని వల్ల వాహన చోదకులతో పాటు పాదాచారులు ఎదుర్కొంటున్న సమస్యను స్వయంగా పరిశీలించారు. కొందరు స్థానికులతో మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా హైవే అథారిటీ, ఇరిగేషన్, జీవీఎంసీ తదితర విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు సూచించారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నయనానందంగా స్వాతినక్షత్ర హోమం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహా లక్ష్మీనృసింహ స్వామివారి దేవాలయంలో ఆదివారం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ప్రధాన అర్చకులు జి. శ్రీనివాసాచార్యులు శ్రీనృసింహ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత చక్రపెరుమాళ్ స్వామి విశేష పూజలు నిర్వహించారు. అగ్ని మథనం, హోమగుండ ప్రదక్షిణం చేశారు. అనంతరం యజ్ఞభగవానుడికి పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని అప్పన్న స్వామికి వేకువజామున పూజా దికాలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తులను యాగశాలలో అధిష్టింపచేసి విష్వక్సేన, పుణ్యాహవచనం పూజలు జరిపారు. అనంతరం నృసింహ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు యజ్ఞ ప్రసాదం అందచేశారు. భక్తులకు యజ్ఞప్రసాదం అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

దక్షిణంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్థానికులకు సూచించారు. ప్రజలకు సహాయ సహకారాలు అందించుటలో జన సైనికులు, కూటమి శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వన్‌టౌన్‌తోపాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను కలసి వారి సమస్యలు తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా వుండాలని, తగు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో వుండి, అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించాలని దక్షిణ నియోజకవర్గ కూటమి శ్రేణులకు తెలిపారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు వున్న తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. జాలారిపేట, నోవేటల్ మార్గంలో వర్షపు నీరు నిలిచిపోతున్న విషయాన్ని అధికారులకు తెలిపి, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సీతమ్మధార శిరిడి సాయి ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గణపతి రెడ్డి అనే ఆటో డ్రైవర్‌కు ఆటో యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ చేతుల మీదగా ఆటో డ్రైవర్ అయినా గణపతి రెడ్డి కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.5000 రూపాయలతో పాటు నిత్యావసర వస్తువులు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో లంక గోవింద్, అప్పలనాయుడు అవునపు శీను, నాయుడు, సోములు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖలో జీవో నెంబర్ 115 వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర - చోడవరం : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 4వ తేదీన ఆరోగ్యశాఖలో విడుదల చేసిన జీవో నెంబర్ 115 ను వెనక్కి తీసుకోవాలని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ ల సంఘం డిమాండ్ చేస్తుంది. ఈ మేరకు ఆదివారం వారు చోడవరం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలిపారు. సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా సంఘ జిల్లా కార్యదర్శి వి నీరజ మాట్లాడుతూ ఏఎన్ఎంలను స్టాఫ్ నర్స్ పోస్ట్ లో సర్దుబాటు చేసేందుకు ఈ జీవో విడుదల చేశారని చెప్పారు. గత 15 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలోనే నియామకాలు జరుగుతున్నాయని గత పది సంవత్సరాలుగా రెగ్యులర్ నోటిఫికేషన్ జారీ చేయడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీఓ వలన తమకు న్యాయం జరగదని కాబట్టి వెంటనే జీ ఓ ను వెనకకు తీసుకోపోతే విధులను బహిష్కరించి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రధాని వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఆస్పత్రి కాంటాక్ట్ స్టాఫ్ నర్స్ లు నీరజ, నూక రత్నం, రమాదేవి, గంగాభవాని, రాధా విశాలాక్షి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని ప్రతి పంచాయతీలో ప్రతి గ్రామంలో వీధివీధిన భక్తులు శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాలను పూజా కార్యక్రమాలు

ఎంతో ఘనంగా ప్రారం భించారు. వినాయక పందిర్లు వద్ద భారీ ఎత్తున హడావిడి మొదలైంది. పూజా కార్యక్రమాలను, స్వామివారికి ప్రసాదాలను, వినాయక వ్రతాలను ఎంతో ఘనంగా భక్తులు నిర్వహించారు. వినాయక ఉత్సవ కమిటీ వారు వినాయక చవితికి రెండు వారాల ముందు నుంచే వినాయక మండపాలు తయారీ మొదలుపెట్టి వినాయక చవితి రోజుకి ఎంతో అందంగా ముస్తాబు చేశారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఒక్కరికి వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదిలా ఉండగా కొన్నిచోట్ల మొదటి రోజు నుంచే అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. కృష్ణాపురం గ్రామంలో సుమారు 2500 మందికి భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొన్నిచోట్ల మొదటి రోజే వినాయక నిమజ్జన కార్య క్రమాలను పూర్తి చేశారు. పోలీస్ శాఖ వారు కూడా మండపం పెట్టుకోవడానికి అనుమతి కోరిన వారికి అనుమతులు ఇవ్వడం జరిగింది.

ఆనందపురం: మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలోనూ వినాయక ఉత్సవాలు ఘనంగా ఏర్పాటు చేశారు. ఆనందపురం పంచాయతీ దొంతల వారి కల్లాలలో ఏర్పాటుచేసిన వినాయక ఉత్సవాలలో ఉత్సవ కమిటీ సభ్యులు దొంతల నాగరాజు, అప్పలనారాయణ, సంజీవరావు, వెంకటనారాయణ, శ్రీను, బద్రి, గణేష్, హనుమంతరావు, రమేష్, వెంకటేష్

తదితరులు పాల్గొన్నారు. లోడగలవానిపాలెం బీసీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ లోడగల రమణ, ఉపసర్పంచ్ కంచిబోయిన శ్రీను, రమణ, అప్పల రాము, రాజు, శ్రీను, గౌరీ ,సురేష్ తదితరులు పాల్గొన్నారు. వేములవలస గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్. ఉత్సవ కమిటీ సభ్యులు కోరాడ మహేష్, నాచు గౌరీ, బోధ అప్పలరాజు, కోరాడ కిరణ్ కుమార్, నాచు లావణ్య, దొంతల కిరణ్, కొట్యాడ శ్యామ్,సారికి విజయ్ ఫ్లైవుడ్ జీవన్ శ్రీరామ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. నేల్తేరు కాలనీలో జరిగిన కార్యక్రమంలోజరిగిన కార్యక్రమంలో బంక వెంకటేష్, కంది గణేష్,బూర్ల భాను, ఇజ్జోడ జగదీష్, నరేష్, వెంకటేష్, గణేష్, శ్రీను, రవి, బంగార్రాజు, అనిల్, రెడ్డి బంగారు రాజు, యశ్వంత్, సాయి తేజ, తదితరుల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సత్య కళ్యాణి అపార్ట్మెంట్లో

భీమిలి క్రాస్ రోడ్ స్థానిక సత్య కళ్యాణి అపార్ట్మెంట్లో వినాయక స్వామి వేడుకలు ఘనంగా నిర్వహించారు స్వామివారికి ధూప దీప నైవేద్యాలతో, పూజలు అర్చనలు, భజనలు

చేశారు. అనంతరం శ్రీ ప్రసన్న నృత్య కళానికేతన్ విద్యార్థుల నృత్య ప్రదర్శన భక్తులు అందర్నీ ఆకట్టుకుంది. మాస్టర్ ఇబ్రహీం ఖాన్ ఆధ్వర్యంలో భరతనాట్యం కార్యక్రమం చేపట్టారు. అపార్ట్మెంట్ వాసులు పెద్దలు ఈ కార్యక్రమం తిలకించారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి శ్రీహరిపురం పవనపుత్ర నగర్ శ్రీరాధాక్రిష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వినాయక

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 61.వార్డ్ టిడిపి మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్: నగరంలోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి మండపాలు వెలిశాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా యువజన సంఘాలు వినాయక చవితి పండుగను నిర్వహించారు.

కంచరపాలెం, సత్యా నగర్కు చెందిన సతీష్ ఆద్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి.

మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ ఆధ్వర్యంలో

పెందుర్తి: మండలంలోని రాంపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష అద్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలో భారీ వినాయక

మండపాన్ని ఏర్పాటు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం, సాయింత్రం వేదపండితులు పూజా దికాలు నిర్వహిస్తున్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అదీప్ రాజ్ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని వినాయకున్ని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బాజిరెడ్డి చిన్నబాబు, అన్నంరెడ్డి జగన్ , బాజిరెడ్డి కృష్ణ , గండి ఎర్రి నాయుడు, బాజిరెడ్డి తులసి, రెడ్డి అర్జున్ రావు, యువన్ వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు సహా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెందుర్తిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి వర్షాన్ని లెక్కచేయకుండా నిర్వాహకులు చాలాచోట్ల మండపాలు ఏర్పాటు చేసి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు పలు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన గణపతి

మండపాలను ఆ పార్టీ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రాము నాయుడు సందర్శించి నిర్వాహకులను అభినందించారు. బిజెపి సిద్ధాంతం ప్రకారం మట్టి గణపతి ప్రతిమలనే ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు ఇంట్లోనూ, కైట్స్ విద్యాలయంలోనూ ఆయన మట్టి గణపతికి పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: 75వ వార్డులో వివిధ ప్రాంతాలలో వివిధ గ్రామ సంఘాల, యువజన సేవా సంఘాల వారు ఏర్పాటు గణేషుని నవరాత్రి పూజా

కార్యక్రమాల్లో 75వ వార్డు కార్పొరేటర్ దంపతులు పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి దంపతులు పాల్గొని అందరూ భక్తి శ్రద్ధలతో ఈ గణేషుని ఉత్సవాలు నిర్వహించుకోవాలని ,వార్డులో ప్రజలందరికీ ఆ దేవదేవుని ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమాలలో స్థానిక నాయకులు మహిళలు,యువకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నియంత్రణకు చైతన్య స్రవంతి సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నియంత్రణకు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఏవీఎన్ కాలేజీ ఎదురు,37 వ వార్డు సచివాలయం గ్రౌండ్ ఫ్లోర్లో చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివారం నిర్వహించిన "ది హ్యూమన్ పాపిలోమా వైరస్" నియంత్రణ క్యాన్సర్ వ్యాక్సిన్ బూస్టర్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధి నివారణకు చైతన్య స్రవంతి ముందుకు రావడం ముదావహమని అన్నారు.ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ను అభినందించి శాలువాతో సత్కరించారు. ముఖ్యంగా 9నుండి 14ఏళ్ల బాలికలకు ఈ వ్యాక్సిన్ వేయడం వల్ల వారికి పెద్ద వయస్సు వచ్చాక క్యాన్సర్ బారి నుండి బయట పడే అవకాశాలు ఉంటాయన్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న జర్నలిస్టుల పిల్లలకు కూడా హెచ్పీవీ వ్యాక్సిన్ వేసేందుకు డాక్టర్ షిరీన్ రహమాన్ ముందుకు రావడాన్ని అభినందించారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ మహిళల్లో హెచ్పీ వైరస్ ను నియంత్రించేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 16న మొదటి డోస్ వ్యాక్సిన్ వేశామని, ఆదివారం బూస్టర్ డోస్ వేసామని చెప్పారు. 9నుండి 14ఏళ్ల లోపు బాలికలకు రెండుసార్లు ఆపై వయసు గల వారికి మూడు సార్లు వ్యాక్సిన్ వేయాల్సి ఉందని ముఖ్యంగా స్వచ్ఛంద సేవా సంస్థలు ఈ వ్యాక్సిన్ వేసేందుకు ముందుకు వస్తున్నప్పటికీ ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం కూడా వ్యాక్సిన్ వేసేందుకు ఒక కార్యాచరణను రూపొందించాలని ఇందుకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సహకరించాలని కోరారు.అత్యంత ప్రమాదకర క్యాన్సర్ ను మహిళల్లో అరికట్టేందుకు ఇప్పటికే తాము అనేక అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశామని అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న దక్షిణ నియోజకవర్గంలోని సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు చెందిన మహిళల పిల్లల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కేజీహెచ్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 4న కాన్సర్ డే సందర్భంగా గర్భాశయ క్యాన్సర్ నియంత్రణ హెచ్పీవీ నిరోధక వ్యాక్సిన్ వేసేందుకు డాక్టర్ షిరీన్ రహమాన్ ముందుకొచ్చారని మొదటిడోస్ ఇప్పటికే వేశామని ఇది బూస్టర్ డోస్ అన్నారు.ఈ వ్యాక్సిన్ వేసుకొన్న వారిలో 70 శాతం మందికి క్యాన్సర్ శోకని విషయం నిర్ధారణ అయిందన్నారు.ఈ కార్యక్రమంలో సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏరియా బిజినెస్ మేనేజర్ బి రాం రతన్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు రుకియా భాను, విజయకుమారి,అనసూయ,రోజా సిహెచ్ లక్ష్మీ, దేవి, లక్ష్మి పాల్గొన్నారు. శిబిరంలో 45మంది బాలికలకు వ్యాక్సిన్ వేశారు.

11న విడుదల కానున్న ఎంజి విండ్సర్ ఇంటిలిజెంట్ క్రాస్ ఓవర్ యుటిలిటి వాహనం

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఎంజి విండ్సర్ - భారతదేశపు మొదటి ఇంటిలిజెంట్ సి యు వి (క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్) సెప్టెంబర్ 11న విడుదలవుతుందని జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా ఈరోజు ప్రకటించింది. ఇంటిలిజెంట్ సి యు వి కి రెండు ప్రపంచాలలోని ఉత్తమత సిడాన్ సౌకర్యం, ఎస్ యువి యొక్క విస్తారత రెండూ ఉంటాయి. ఎంజి సియువి 'ఏరోగ్లైడ్ డిజైన్' గొప్ప కళాపనితనంతో ఆధునిక ఏరోడైనమిక్స్ ను నిరంతరంగా సమీకృతం చేస్తోంది. డైమండ్ కట్ అల్లోయ్ వీల్స్ తో శ్రేణిలో అతి పెద్ద వీల్ బేస్ ను కలిగి ఉంది.

సాఫీ డ్రైవ్ అనుభవం అందించడానికి ఇది పెరిగిన గ్రౌండ్ క్లియరెన్స్ ను ఇస్తుంది. ఎంజి విండ్సర్ ఈవి కొన్ని కఠినమైన వాతావరణాలు మరియు తీవ్రమైన వేడిలో అత్యధికంగా తట్టుకోవడం, సామర్థ్యపు పరీక్షలలో ఉత్తీర్ణమైంది.

సాల్వ్ ఫర్ టుమారో గ్రాండ్ ఫినాలేకి 10 జట్లు

విశాలాంధ్ర- విశాఖపట్నం: శామ్సంగ్ ఇండియా తన ఫ్లాగ్షిప్ సిఎస్ఆర్ ప్రోగ్రామ్ 2024లో 'సాల్వ్ ఫర్ టుమారో' టాప్ 10 టీమ్లను ప్రకటించింది. టాప్ 10 జట్లు ఇప్పుడు గ్రాండ్ ఫినాలేకి చేరుకుంటాయి, అక్కడ వారు తమ ప్రత్యేకమైన ఆలోచనలను శామ్సంగ్ నాయకత్వం మరియు ఇతర కీలక పరిశ్రమ నాయకులతో కూడిన గ్రాండ్ జ్యూరీకి అందజేస్తారు. షార్ట్లిస్ట్ చేయబడిన జట్లు అస్సాంలోని గోలాఘాట్ మరియు కమ్రూప్ రూరల్, రాజస్థాన్లోని ఝలావర్, కర్ణాటకలోని ఉడిపి మరియు ఛత్తీస్గఢ్లోని బిలాస్పూర్తో సహా దేశంలోని కొన్ని మారుమూల ప్రాంతాల నుండి వచ్చాయి. ఇవి ప్రోగ్రామ్ యొక్క విస్తృత ప్రాంతీయ ఉనికిని ప్రదర్శిస్తుంది.

ఈ ఫైనలిస్టులు కఠినమైన ఎంపిక ప్రక్రియలో ఉన్నారు, ఇందులో శామ్సంగ్ మరియు ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్ %డ% టెక్నాలజీ ట్రాన్స్ఫర్, ఐఐటి ఢిల్లీకి చెందిన నిపుణులచే మెంటరింగ్ మీటింగ్లు ఉన్నాయి.

హైస్కూల్ ప్రహరీ కూలి బైకులు, రిక్షా ధ్వంసం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో హై స్కూల్ కాలనీ వద్ద శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలకు హైస్కూల్ ప్రహరీ గోడ కూలి బైకులు, రిక్షా ధ్వంసమయ్యాయి అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు ప్రహరీ గోడ కూలడం వలన అదృష్టం సొత్తు ప్రాణ నష్టం జరగలేదని స్థానికులు చెబుతున్నారు. ఘటన స్థలానికి మండల ఎంపీడీవో లవ రాజు,తాసిల్దార్ శ్యామ్ ప్రసాద్, ఏఈ సురేష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది చేరుకున్నారు. కాసేపటికి శాసనసభ్యులు అక్కడికి చేరుకొని మరో రెండు రోజులు వర్షాలు పడనున్న నేపథ్యంలో ప్రహరీ గోడను యుద్ధ ప్రాతిపదకను చర్యలు చేపట్టాలని స్థానిక శాసనసభ్యులు శ్రీనివాసరావు తెలిపారు. అలాగే దెబ్బతిన్న బైకులకు నష్టపరిహారం బాధితులకు అందేలా చూడాలని తాసిల్దార్ శ్యాంప్రసాద్ కు ఆదేశించారు. గంభీరం రిజర్వాయల్లో నీరు ఎక్కువ అవ్వడంతో ఏ క్షణంలోనైనా గేట్లు తెరిచే అవసరం ఉందని వాగు పరివాహక ప్రాంతాల్లో ఉండే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తాసిల్దార్ తెలిపారు. బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గొట్టిపల్లి కల్లాల వద్ద వర్షపు నీరు ఇంటి పరిసరాల్లోకి వెళ్లడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో అడపా లావరాజు, అధికారులను ఆదేశించి పనులు చేపట్టి సమస్యను పరిష్కరించారు.అలాగే మండలంలో శనివారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ,గెడ్డలు, గుట్టలు, పొంగి ప్రవహిస్తున్నాయి. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఆర్ ఐ మణికంత, వీఆర్వో అప్పలరాజు,స్థానిక సర్పంచులు చందక లక్ష్మి, లోడగల రమణ, కూటమి నాయకులు శ్రీనుబాబు, మజ్జి వెంకట్రావు, సత్యనారాయణ, రమాదేవి, తమ్మిన అప్పలరాజు, కంచి బోయిన శ్రీను, వెంకట్రావు, బి ఆర్ బి నాయుడు, పైడిరాజు ,గోవిందరావు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - పెందుర్తి: గణపతి నవరాత్రి మహోత్సవాలు పెందుర్తి మండలంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. యువకులు ఊరు, వాడా మండపాలను ఏర్పాటు చేసి సందడి చేస్తున్నారు. కాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు, మాజీ కార్పోరేటర్ శరగడం చిన అప్పలనాయుడు జీవీఎంసీ 96 వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన పలు మండపాలను సందర్శించారు. స్థానిక నాయకులు అవగడ్డ స్వామినాయుడు, లాలం అప్పలనాయుడు, శరగడం రామక్రుష్ణ, మీసాల విజయలక్ష్మీ, అప్పారావు, రాజు, మురళి తదితరులతో కలిసి పెందుర్తి పాతఊరు, రాజు చెరువు, జేఎన్ఎంఆర్ కాలనీ, దాడివారి కళ్లాలు, వెలంపేట, దొగ్గవానిపాలెం తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించిన చిన అప్పలనాయుడు నిర్వాహకులను అభినందించారు.

ఆయా మండపాల వద్ద పూజాదికాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులతో మాట్లాడి గణపతి చతుర్ధి శుభాకాంక్షలు తెలియచేసారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా జిల్లాలో గల అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సోమవారం సెలవుదినంగా ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సెలవు దినంగా పాటించాలని, ఎవరైనా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఉత్తర్వులు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రకటనలో హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రతి సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ లో నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లాలో వర్షాలు కురుస్తున్న దృష్ట్యా సోమవారం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

కమాండ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు

జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు రెవిన్యూ డివిజనల్ అధికారి, అనకాపల్లి , నర్సీపట్నం కార్యాలయాలలో కూడా కమెండ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ప్రజలు కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ల ద్వారా సహాయం పొందవచ్చు అని తెలిపారు. కలెక్టర్ కార్యాలయం కమెండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08924-226599 మరియు 08924-222888. రెవెన్యూ డివిజనల్ అధికారి, అనకాపల్లి కార్యాలయం కమెండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9491998293 రెవెన్యూ డివిజనల్ అధికారి, నర్సీపట్నం కార్యాలయం కమెండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 7075356563 ఉపయోగించుకోవాలని కోరారు.

విశాఖలో పోర్టర్ లాజిస్టిక్ సేవల విస్తరణ

విశాలాంధ్ర /విశాఖపట్నం: భారతదేశంలోని ప్రముఖ టెక్-డ్రివెన్, ఆన్-డిమాండ్ లాజిస్టిక్స్ కంపెనీలలో ఒకటైన పోర్టర్, తన లాజిస్టిక్స్ సేవల సమగ్ర సూట్ను విశాఖపట్నంలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని ప్రకటించింది. పోర్టర్ దశాబ్దపు ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఎందుకంటే, ఇది ఆంధ్రప్రదేశ్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగర కేంద్రాలలో ఒకటిగా ఉన్న విశాఖపట్నంలో తన లాజిస్టిక్స్ సేవల సమగ్ర సూట్ను విస్తరించింది. పోర్టర్ టూ-వీలర్ల బృందంతో పాటు, త్రీ-వీలర్లతో సేవలను పరిచయం చేయడం ద్వారా రాబోయే నెలల్లో మరింత వైవిధ్యమయ ఆఫర్లను అందించాలని యోచిస్తోంది. తద్వారా విస్తృత శ్రేణి లాజిస్టిక్స్ అవసరాలను తీర్చనుంది.

సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రతికూల వాతావరణం, ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. భారీ వర్షాలు కారణంగా ప్రజా వినతులు స్వీకరణ కార్యక్రమాన్ని ముందు జాగ్రత్త చర్యగా రద్దు చేస్తున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖలో భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, మరో రెండు రోజులు భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, జీవీఎంసీ అధికారులు నగరంలో నిరంతరం పర్యటిస్తూ జాగ్రత్త చర్యలను చేపడుతున్నారని, నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశాఖ నగర మేయర్ పేర్కొన్నారు. ఆదివారం ఆమె జోన్-3,5 లలో ఎర్రిగెడ్డ ను, పెదజాలారిపేట బీచ్ ను, జీవీఎంసీ లో సిటిసి సెంటర్ ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పర్యటనలో మేయర్ మాట్లాడుతూ జోన్ -5 జ్ఞానాపురం వద్ద ఎర్రిగెడ్డలో వ్యర్థాలను పరిశీలించి వెంటనే జెసిబి లతో తొలగించి గెడ్డ పొంగిపొర్లకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అనంతరం జోన్-3 లాసన్స్ బే కాలనీ సమీపంలో పెదజాలారిపేట బీచ్ ను పరిశీలించి బీచ్ లో గణేష్ నిమజ్జనాల వ్యర్థాలను వెంటనే తొలగించాలని, వర్షాలు కారణంగా గణేష్ నిమజ్జనాలు ఏర్పాట్లను మరింత పటిష్టం చేయాలని అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి ని మేయర్ ఆదేశించారు. అనంతరం జీవీఎంసీ సివోసి సెంటర్ ను జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్ తో కలిసి సందర్శించి నగరంలో పలు ప్రదేశాలను స్క్రీన్ ల నందు పరిశీలించారు. వర్షాలు కారణంగా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఏడు ఫిర్యాదులు అందగా అందులో మూడు చోట్ల కైలాసపురం, మల్కాపురం ,హనుమంతువాక గిరిప్రదక్షిణ రోడ్డులో కొండ చరియలు విరిగిపడినట్లుగా, పలుచోట్ల కాలువలు బ్లాక్ అయ్యాయని ఫిర్యాదులు అందాయని మేయర్ కు సి ఓ సి సిబ్బంది తెలిపారు. కొండవాలు , లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమీపంలో గుర్తించిన పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేపట్టాలని, కాలువలు పొంగిపొర్లకుండా నిరంతర పర్యవేక్షణ జరపాలని చీఫ్ ఇంజనీర్ కు మేయర్ ఆదేశించారు. నగరంలో అన్ని జోన్లలో 81 పల్లపు ప్రాంతాలను (లో లైన్ ఏరియాలను) గుర్తించడమైనదని, రైల్వే క్రాసింగ్ కింద కల్వర్ట వద్ద వ్యర్థాలను నిలిచిపోవడాన్ని గుర్తించి ఆయిల్ ఇంజన్ల సహాయంతో వాటిని తొలగించి తరలించడం జరుగుతుందని, అందరు జోన్ల కమిషనర్లు, ఇంజనీర్లు, ఇతర సిబ్బంది నిరంతర పర్యవేక్షణలో ఉన్నారని, ఆర్ డి యార్డు ,ఎర్రిగడ్డ ప్రాంతాల్లో అదనంగా జెసిబి మిషన్ల తో వ్యర్థాలను తొలగిస్తున్నామని ప్రధాన ఇంజనీర్ మేయర్ కు వివరించారు. నగరంలో వర్షాలకు ఇబ్బందులకు గురైన కొండ చర్యలు విరిగిపడిన కొండ చర్యలు విరిగిపడిన కాలువలు

పొంగిపొర్రున తదితర సమాచారాన్ని వెంటనే జీవీఎంసీ సిటిసి సెంటర్ 1800 4250 0009 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి తెలియపరచాలని మేయర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్లు జె .విజయలక్ష్మి ,ఆర్జివి కృష్ణ , పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్, సహాయ వైద్యాధికారి బి.ప్రసాద్ రావు, ఇంజనీర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.